
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

బుధవారం 17 సెప్టెంబరు 2025

# ఆరోగ్యం, విద్యాభివృద్ధిపై సీఎం సమీక్ష

- లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశం
- సదస్సులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ





సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, హాజరైన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, ఆరోగ్యం, విద్య, మహిళా-శిశు సంక్షేమం వంటి రంగాల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్షించారు. అమరావతిలోని వెలగపూడి సచివాలయం వేదికగా రెండో రోజు మంగళవారం కూడా సీఎం నేతృత్వంలో కలెక్టర్ల సదస్సు కొనసాగింది. ఆరోగ్యం, విద్య, మహిళా సంక్షేమ రంగాల్లో జిల్లా కొంత పురోగతి సాధించినా, గర్భిణులకు పరీక్షలు, పిల్లల స్క్రీనింగ్‌లో లక్ష్యసాధన చాలా తక్కువగా ఉన్నట్లు సదస్సులో వెల్లడైంది. పరిపాలన, సాంకేతిక విద్య, మహిళా రక్షణలో మెరుగైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు.


- ఆరోగ్య విభాగానికి సంబంధించి.. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిల్లో ప్రసవాల సంఖ్య పెరిగింది. ఆర్బీఎస్‌కే స్క్రీనింగ్, అంగన్‌వాడీలు, పాఠశాలల్లో పిల్లలకు కేవలం 25శాతం లోపు మాత్రమే వైద్యపరీక్షలు నిర్వహించడం వంటివి గుర్తించారు. 4,267 నోటి క్యాన్సర్ అనుమానితుల్లో 3,487 మందిని పరీక్షించగా.. 40 మందిని రిఫర్ చేశారు. 2,230 మంది బ్రెస్ట్‌క్యాన్సర్ అనుమానితుల్లో 1,877 మందికి పరీక్షించి.. 48 మందిని రిఫర్ చేశారు. సర్వైకల్ (మిగతా 6వ పేజీలో..)

## ప్రకృతి ఒడిలో.. 'గంగా'హతి

- ఆకట్టుకుంటున్న జలపాతం

పలాస, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పలాస రైల్వేస్టేషన్‌కు 20 కిలోమీటర్ల దూరంలో.. ఒడిశా రాష్ట్ర భూభాగంలో ఉన్న గండాహతి జలపాతం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం భారీవర్షాలు కురుస్తుండడంతో మహేంద్రగిరులను దాటుకుంటూ 40 అడుగుల ఎత్తయిన పర్వతం నుంచి గంగా ప్రవాహం జాలువారుతోంది. ఈ దృశ్యాన్ని చూసి పర్యాటకులు పరవశించిపోతున్నారు.

- ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం గండాహతి జలపాతాలను కాపా డుకునేందుకు ఆ ప్రాంతంలో అటవీ, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపట్టింది. దీంతో నేరుగా జాలువారే నీటి ప్రవాహం వద్దకు పర్యాటకులు చేరుకోవచ్చు. పలాస మీదుగా మెళియాపుట్టి మండలం గొప్పిలి నుంచి ఎడమభాగంలో ఉన్న ఒడిశా రోడ్డు మీదుగా గండాహతి జలపాతాల వద్దకు వెళ్లేందుకు పక్కా రహదారి మార్గం ఉంది.



# అంగన్‌వాడీలకు సన్నబియ్యం

- ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరి అమలుకు సన్నాహాలు
- పౌరసరఫరాల శాఖ కసరత్తు

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు : 16
ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు : 2,786
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు : 599
మూడేళ్లలోపు చిన్నారులు : 65,422 మంది
3 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులు : 39,939 మంది
గర్భిణులు : 9,944 మంది
బాలింతలు : 7,429 మంది

హిరమండలం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణకు ప్రాధాన్యమిచ్చేలా అంగన్‌వాడీ కేంద్రాలకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యాన్ని వినియోగిస్తున్నారు. దీంతో పాఠశాలల్లో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. కాగా దొడ్డు బియ్యం వినియోగిస్తుండడంతో అక్కడ అన్నం తినిపించేందుకు చిన్నారుల తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. భోజనానికి చాలామంది పిల్లల్ని ఇంటికి తీసుకెళ్తున్నారు. బాలింతలు, గర్భిణులు కూడా ఫోర్టిఫైడ్ బియ్యం కాకుండా సన్నబియ్యం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం సరఫరాకు పౌరసరఫరాలశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం బాలింతలు, గర్భిణులకు నెలకు 3కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నారు. మూడు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు కేంద్రంలోనే భోజనం పెడుతున్నారు. వారికి 75గ్రాముల చొప్పున బియ్యాన్ని కేటాయిస్తున్నారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకానికి అందిస్తున్న బియ్యానికి తోడు నెలకు (మిగతా 6వ పేజీలో..)



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

# జేఈఈ, నీట్ కోచింగ్



పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల ఎంసెట్, నీట్‌పై అవగాహన పరీక్ష రాస్తున్న విద్యార్థులు

- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పోటీ పరీక్షలకు శిక్షణ
- ఇందుకోసం అధ్యాపకులకు ప్రత్యేక తరగతులు
- వారంలో మూడు రోజులపాటు విధిగా తరగతులు
- సమూలమార్పులు తీసుకు వచ్చిన ప్రభుత్వం
- విద్యార్థుల తల్లిదండ్రుల్లో హర్షాతిరేకాలు

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు: 38
ఆదర్శ పాఠశాలలు : 13
కస్తూర్బా విద్యాలయాలు : 25
హైస్కూల్ ప్లస్ : 6
గురుకుల విద్యాలయాలు : 9
ఇంటర్ చదువుతున్న విద్యార్థులు : 12 వేల మందికిపైగా

కాశీబుగ్గ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యలో సమూల మార్పులు తీసుకొచ్చింది కూటమి ప్రభుత్వం. ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రక్షాళనకు దిగింది. జాతీయ స్థాయిలో మారుతున్న విద్యావిధానానికి అనుగుణంగా సీబీఎస్‌ఈ సిలబస్‌తో విద్యార్థులకు బోధన అందిస్తోంది. ఆపై కార్పొరేట్ కాలేజీలకు దీటుగా నీట్, ఐఐటీ, జేఈఈ, ఏఈపీసెట్ తదితర పోటీ పరీక్షలకు సైతం విద్యార్థులకు శిక్షణ అందించి వారిని సిద్ధం చేస్తోంది. దీనిపై రెగ్యులర్, కాంట్రాక్ట్, అతిథి అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ కొనసాగుతోంది. ఒకవైపు అధ్యాపకుల శిక్షణ, ఇంకో వైపు విద్యార్థులకు బోధన సమాంతరంగా నడుస్తోంది. దీంతో ఈ ఏడాది ఇంటర్‌లో ఉత్తీర్ణతతో పాటు పోటీ పరీక్షల్లో సైతం ఇంటర్ విద్యార్థులు సత్తాచాటే అవకాశం ఉంది.

### ముందస్తుగానే పుస్తకాలు సరఫరా..

వైసీపీ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు అరకొరగానే పాఠ్య పుస్తకాలను అందించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం ముందస్తుగానే అన్ని పుస్తకాలను పంపిణీ చేసింది. పాఠ్య పుస్తకాలతోపాటు ఐఐటీ, నీట్, జేఈఈ, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను సరఫరా చేసింది. కార్పొరేట్ స్థాయిలో బోధనా సౌకర్యాలు కల్పించడంతో ఈ ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెరిగాయని అధికారులు చెబుతున్నారు. ఐఐటీ, నీట్, జేఈఈ, ఎంసెట్‌లో ప్రభుత్వ విద్యార్థులు మంచి ర్యాంకులు పొందితే మాత్రం వచ్చే ఏడాది ప్రవేశాలు మరింత పెరిగే అవకాశముంది.

### అధ్యాపకులకు శిక్షణ.. విద్యార్థులకు బోధన..

ఐఐటీ, జేఈఈ, నీట్స్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు సంబంధించి బోధనకుగాను అధ్యాపకులకు శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీలో ఆగస్టు నుంచి శిక్షణ ప్రారంభమైంది. విడతల వారీగా అన్ని జూనియర్ కాలేజీలకు చెందిన మ్యాథ్స్, వృక్ష, జంతు, భౌతిక, రసాయన అధ్యాపకులకు అధికారులు శిక్షణ అందిస్తున్నారు. బిట్స్ అనేవి ఎలా చెప్పితే విద్యార్థులకు అర్థం అవుతుందో ఈ శిక్షణలో వివరిస్తున్నారు. ఐఐటీ, జేఈఈ, నీట్స్, ఎంసెట్‌కు ఎలా తర్ఫీదునివ్వాలో చెబుతున్నారు. డిసెంబరు వరకు ఈ శిక్షణ కొనసాగనుంది. శిక్షణలో నేర్చుకున్న అంశాల ఆధారంగా వారంలో మూడు రోజులు అధ్యాపకులు విద్యార్థులకు బోధిస్తున్నారు. ప్రతి శనివారం ఇంటర్ బోర్డు ఆన్‌లైన్ ద్వారా పోటీ పరీక్ష పేపర్ పంపిస్తుంది. దీనిపై విద్యార్థులకు పరీక్ష నిర్వహించి, వారి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

### వసతులు మెరుగు..

ఒకవైపు బోధనాపరంగా.. మరోవైపు వసతులపరంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలను తీర్చిదిద్దారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన పథకం అమలుచేస్తున్నారు. సన్నబియ్యంతో కూడిన మంచి ఆహారం విద్యార్థులకు అందిస్తోంది. తల్లికివందనం పథకం అమలు చేస్తుంది. ఒకవైపు ఇంటర్ విద్యను సంస్కరించడం, ఇంకోవైపు బోధన మెరుగుపరచడం, మరోవైపు జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా తీర్చిదిద్దడంతో (మిగతా 6వ పేజీలో..)

### అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి



విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేసేలా బోధనపై ప్రతి అధ్యాపకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో ఈ ఏడాది నుంచి ఎంసెట్, నీట్, జేఈఈకి సంబంధించి తరగతులు, అవగాహన పరీక్షలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో ప్రస్తుతం 26 కళాశాలలకు వెళ్లి బోధన తీరును పరిశీలించాం. ప్రభుత్వ ఆలోచనతో విద్యార్థుల్లో పోటీపరీక్షలపై మరింత ఆసక్తి కనిపిస్తోంది.

- ఆర్.సురేష్‌కుమార్, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి

**నమ్మించి.. మోసం చేసి**
- ఆరేళ్లు కాపురం.. ఓ మగబిడ్డకు జన్మ
- పనికి వెళ్తానని చెప్పి పరారైన వ్యక్తి
- ప్రియుడి ఇంటి ముందు బాధితురాలి నిరసన 8లో

**16 కిలోల గంజాయి స్వాధీనం**
- సాగుదారుడు, కొనుగోలుదారులపై కేసు నమోదు
- కిలోకు రూ.ఐదు వేలు ఇస్తామని ఆశచూపడంతో తరలింపు

**రైతులూ.. జాగ్రత్త**
- క్రిమిసంహారక మందుల పిచికారీలో అప్రమత్తత అవసరం
- అధికారుల సూచనలు పాటించండి 6లో

**కొత్తమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం**
- ఆర్డీవో కృష్ణమూర్తి



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేపి మౌలానా

## న్యాయసహాయంలో కీలకపాత్ర పోషించాలి

- జిల్లా న్యాయాధికారి జేపి మౌలానా

శ్రీకాకుళం లీగల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు న్యాయసహాయం అందించడంలో పారాలీగల్ వలంటీర్లు కీలకపాత్ర పోషించాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పౌరుల హక్కులు, విధులను పారాలీగల్ వలంటీర్లకు వివరించారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాన్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు న్యాయవాదులు అన్నెపు భువనేశ్వర్, గేదెల ఇందిరాప్రసాద్, లీగల్‌ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది కె.ఆవీస్ నాయుడు పాల్గొన్నారు



గెడ్డ దాటుతున్న రైతులు..

# గెడ్డ దాటుతూ.. ముందుకు 'సాగు'తూ..

- ఉధృతంగా సునాముది, సంకుజోడి కాలువల ప్రవాహం
- రెండు గ్రామాల రైతులకు తప్పని ఇబ్బందులు

హరిపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేపట్టాలంటే.. గెడ్డ దాటే సాహసం చేయాల్సిందే. తలపై బరువులు మోస్తూ.. దాదాపు మనిషి మునిగేలోతులో నీటి ప్రవాహానికి ఎదురీది గెడ్డ దాటితేనే.. రైతులు తమ పొలాలకు చేరుకోగలరు. పంటలు పండించుకోగలరు. ఇదీ మందస మండలం డబారు, వీవీఆర్ పురం రైతుల దీనగాథ. దశాబ్దాలుగా గెడ్డపై కాజ్‌వే నిర్మించాలనే రైతుల ఆకాంక్ష కార్యరూపం దాల్చటం లేదు. ఈ రెండు గ్రామాలకు ఒకవైపుగా సుమారు 280 ఎకరాల సాగుభూమి ఉంది. ఏటా ఖరీఫ్ సాగుకు ఇక్కడి రైతులు సాహసం చేయాల్సిందే. పొలం పనుల కోసం గెడ్డ దాటి వెళ్లాలి. వర్షాకాలంలో సునాముది, సంకుజోడి కాలువలు ఒక్కటై ప్రవహిస్తాయి. దీంతో నీటి ప్రవాహ ఉధృతి పెరిగి ఈ రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులంతా తినే తిండి నుంచి వరి పొలాలకు వేసే ఎరువు వరకు తలపై పెట్టుకొని నీటి ప్రవాహానికి ఎదురెళ్లి సాగు చేయాల్సిన దీనస్థితి. వర్షాలు పడే సమయంలో పొలాలకు వెళ్లే పరిస్థితి లేదు. పొలాల్లో పనిచేస్తున్న సమయంలో వర్షం వస్తే రాత్రీపగలు అక్కడే తలదాచుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ గెడ్డపై కాజ్‌వే నిర్మించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు దశాబ్దాలుగా మొరపెట్టుకుంటున్నా.. సమస్య పరిష్కారం (మిగతా 6వ పేజీలో..)

# మ్యాజిక్ డ్రెయిన్లు

- ఎక్కడి నీరు అక్కడే భూమిలోకి
- తక్కువ ఖర్చుతో నిర్మాణం
- తప్పనున్న మురుగు కష్టాలు
- పైలెట్ ప్రాజెక్టుగా నాలుగు పంచాయతీలు ఎంపిక



- ఇది మెళియాపుట్టి మండలం కొసమాళ పంచాయతీలోని బీసీ కాలనీ. కాలువలు సక్రమంగా లేక ఇటీవల కురిసిన వర్షానికి నీరు ఇలా వీధిలో నిలిచిపోయింది. ఈ గ్రామంలో సుమారు 709 కుటుంబాలు నివసిస్తున్నాయి. 2,254 మంది జనాభా ఉన్నారు. గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో పూర్తిగా కాలువలు లేవు. వర్షపు నీరు రోడ్లపైనే ప్రవహిస్తుంది. ఎక్కడ చూసినా బురదమయంగా కనిపిస్తుంది. కొన్నిసార్లు ఇళ్లలోకి మురుగునీరు చేరుతుంటుంది. ప్రతి ఏడాది ఇదే పరిస్థితి. గత వైసీపీ పాలనలో పంచాయతీల నిధులు దారిమళ్లాయి. ఎక్కడా తట్టెడు సిమెంట్ పని జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొంతమంది టీడీపీ నాయకులు కొసమాళ పంచాయతీ పరిస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చుతో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి ఇటీవల అధికారులు భూమిపూజ చేశారు. దీంతో పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెళియాపుట్టి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వర్షం పడితే చాలు కొన్ని గ్రామాల్లో వరదనీరు నిలిచిపోతుంది. కాలువలు సక్రమంగా లేక మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తుంది. దీంతో ప్రజలు పడే కష్టాలు అన్నీఇన్నీ కావు. ఇక నుంచి వారికి ఆ కష్టాలు ఉండవు. తక్కువ ఖర్చుతో గ్రామాల్లో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనున్నారు. ఎక్కడి నీరు అక్కడే భూమిలోకి ఇంకిపోయేలా చేయడమే ఈ మ్యాజిక్ డ్రెయిన్ల ప్రత్యేకత. పైలెట్ ప్రాజెక్టు కింద మొదటి విడతగా జిల్లాలోని రణస్థలం మండలం తిరుపతిపాలెం, జి.సిగడాం (మిగతా 6వ పేజీలో..)

## ఐటీఐ మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అడ్మిషన్ల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు మంగళవారం తెలిపారు. 'ఆసక్తి గల అభ్యర్థులు.. చేరాలనుకుంటున్న ఐటీఐలకు ఈ నెల 27వ తేదీలోగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. డౌన్‌లోడ్ చేసిన రిజిస్ట్రేషన్ ఫారం, ఒరిజినల్ సర్టిఫికెట్లను సమీప ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 28లోగా పరిశీలన చేయించుకోవాలి. 29న ప్రభుత్వ ఐటీఐల్లో, 30న ప్రైవేటు ఐటీఐ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ ఉంటుంది. సీటు కోసం దరఖాస్తు చేసుకున్న ఐటీఐలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి. మరిన్ని వివరాల కోసం ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐని సంప్రదించాలని సుధాకరరావు తెలిపారు.



# రైతులూ.. జాగ్రత్త

- క్రిమిసంహారక మందుల పిచికారీలో అప్రమత్తత అవసరం
- అధికారుల సూచనలు పాటించండి

నరసన్నపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): క్రిమి సంహారక మందుల వాడకంలో మెలకువలను పాటించాలని నరసన్నపేట వ్యవసాయ సబ్‌డివిజన్ ఏడీఏ వెంకటమధు రైతులకు సూచించారు. వాడుకలో అజాగ్రత్తగా వ్యవహరిస్తే మనుషులతో పాటు జంతువులు, మొక్కలకు ప్రమాదమని చెప్పారు. అంతేగాక మేలు చేకూర్చే మిత్ర పురుగులు, మిత్ర జీవులు క్రిమిసంహారక మందుల విష ప్రభావం వల్ల చనిపోతాయన్నారు. మందుల ఎంపిక దగ్గరి నుంచి వాటిని పిచికారీ చేసే వరకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**కొనేముందు ఏం చేయాలంటే..**

● పురుగులు, చీడల నివారణకు మందులను పొడి, ద్రవ, గుళికల రూపంలో తయారు చేస్తారు. రసం పీల్చే పురుగులైనా, పేను, పిండి పురుగు తదితర వాటికి మొక్క లోపలి భాగాలకు ప్రసరించే మందులు బాగా ప నిచేస్తాయి. రైతులు పురుగులు ఎలాంటివో గుర్తించడంతో పాటు సందేహం వస్తే వ్యవసాయాధికారిని సంప్రదించాలి.

● అధికారులు సిఫారసు చేసిన పురుగు మందులను మాత్రమే కొనుక్కోవాలి.

● అధీకృత డీలర్ల నుంచి మాత్రమే నాణ్యత గల కీటక నాశినులను కొనుగోలు చేయాలి.

● మందు డబ్బా లేదా ప్యాకెట్ సీలు సరిగ్గా ఉందో లేదో చూసుకోవడంతో పాటు తప్పక బిల్లు తీసుకోవాలి.

● పురుగు మందుల డబ్బా, ప్యాకెట్ మీద ఉండవలసిన వ్యాపార నామం, విష పదార్థపు శాతం, కంపెనీ పేరు, అడ్రస్, లైసెన్స్, బ్యాచ్ నెంబర్, తయారీ తేదీ, ఎప్పటి వరకు వాడవచ్చు వంటి వివరాలను నిశితంగా పరిశీలించాలి.

**ఈ జాగ్రత్తలు తీసుకోండి..**

● మందుల నిల్వ, రవాణా చేసే సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. డబ్బాలను గట్టిగా మూసి ఉంచాలి.

● పురుగు మందులను మన ఆహార పదార్థాలు, కోళ్ల, పశువుల మేత, విత్తనాలు, నీళ్ల ఉన్న దగ్గర నిల్వ ఉంచరాదు.

● గాలి, వెలుతురు తగిలే ప్రాంతంలో, ఎండ తగలని చోట ఉంచాలి.

● పురుగు మందులు ఉండే గదులు, బీరువాలకు తాళాలు వేసి ఉంచాలి.

● పిల్లలకు, పెంపుడు జంతువులకు దూరంగా ఉంచాలి.

● పురుగు మందులను ఇతర మందులైన తెగుళ్ల, కలుపు మందుల నుంచి వేరుగా పెట్టుకోవాలి.

● పురుగు మందులు నిల్వ ఉన్న గదిలోకి వెళ్లే ముందు ఒక అరగంట పాటు తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలి.

పిచికారీ సమయంలో ఏం చేయాలంటే..

● లేబుల్ మీద ఉన్న విషయాన్ని చదవాలి.

● నాణ్యమైన, చిల్లులు లేని, మందు ద్రావణం కారకుండా పనిచేసే పిచికారీ పరికరాలు (స్ప్రేయర్లు) విని యోగించాలి.

● ఎంత నీటికి ఎంత మందు వాడాలన్నది లెక్క వేసుకోవాలి.

● నీళ్ల, సబ్బు, రుమాలు దగ్గరలో ఉంచుకోవాలి.

● మందు ద్రావణాన్ని గరాటుతో పోసుకోవాలి. పొరపాటున నోటితో పీల్చరాదు.

● పురుగు మందు వాడేటప్పుడు, నీటిలో కలిపేటప్పుడు, పిచికారీ చేసే సమయంలో శరీరానికి రక్షణ కల్పించుకోవాలి.

● ఉదయం, సాయంత్రం సమయాల్లోనే పిచికారీ చేయాలి.

● చేతులకు రబ్బరు తొడుగులు, ముఖానికి రక్షణ కవచం, తలకు టోపీ పెట్టుకోవాలి.

● పొగ తాగకూడదు. నీళ్ల తాగే ముందు, ఏదైనా తినే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.

**మందు చల్లిన తరువాత..**

● మిగిలిపోయిన మందు ద్రావణాన్ని అలాగే ఉంచకూడదు. పారే నీటిలో కలుపకూడదు. గట్ల మీద, బీడులలోను పిచికారీ చేయకూడదు.

● వాడిన ఖాళీ డబ్బాలను, ప్యాకెట్లను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా భూమిలో లోతుగా గొయ్యి తీసి పాతిపెట్టాలి. వీటిని గృహావసరాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించకూడదు.

● విష ప్రభావం కనిపిస్తే... వెంటనే ప్రాథమిక చికిత్స చేసి డాక్టర్‌ను సంప్రదించాలి. పురుగు మందు వివరాలున్న కరపత్రాన్ని చూపించాలి.

## జేఈఈ, నీట్ కోచింగ్

(ఐదో పేజీ తరువాయి)

సత్ఫలితాలు ఇచ్చే అవకాశం ఉంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**శుభ పరిణామం..**



ప్రభుత్వం ఇంటర్ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టింది. ఐఐటీ, జేఈఈ, నీట్,ఎంసెట్ వంటి పోటీ ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించడం శుభ పరిణామం. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలను నిలపాలన్న ప్రయత్నం ఆహ్వానించదగ్గది.

-ఫల్గుణరావు, రసాయనశాస్త్ర అధ్యాపకుడు, బాలుర ప్రభుత్వ జూనియర్ కాలేజీ

**సిలబస్‌లో మార్పు..**



ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం సిలబస్ మారింది. కేవలం పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకొనే ఇంటర్ బోర్డు ఈ మార్పు తెచ్చింది. సెకెండ్ లాంగ్వేజ్‌గా ఎంపీసీలో ఒక గ్రూప్, బైపీసీలో ఒక గ్రూప్‌గా ఎంపిక వెనుక అదే ఆలోచన. పాఠ్యపుస్తకాలు కూడా ముందస్తుగా అందించడం, అధ్యాపకులకు శిక్షణ నివ్వడంతో బోధన ప్రారంభమైంది. కచ్చితంగా అనుకున్న లక్ష్యాలను జూనియర్ కాలేజీలు చేరువవుతాయి.

-వెంకటేశ్వరరావు, భౌతికశాస్త్ర అధ్యాపకుడు, బాలుర ప్రభుత్వ జూనియర్ కాలేజీ

**అర్థమయ్యేలా బోధిస్తున్నారు..**



సిలబస్ కష్టంగా ఉన్నా అధ్యాపకులు అర్థమయ్యే రీతిలో చెబుతున్నారు. ముఖ్యంగా నీట్, ఐఐటీ, జేఈఈ, ఎంసెట్ ప్రవేశ పరీక్షలకు సంబంధించి షార్ట్‌కట్ విధానంలో బోధన చేస్తున్నారు. తప్పకుండా పోటీ పరీక్షల్లో రాణిస్తాం అనే నమ్మకం కలిగిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

-జాస్మిని, విద్యార్థిని, పూండి

## గెడ్డ దాటుతూ.. ముందుకు 'సాగు'తూ..

(ఐదో పేజీ తరువాయి)

కావడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి కాజ్‌వే నిర్మించాలని వేడుకుంటున్నారు.

**పంటకు గ్యారంటీ లేదు..**



ఎంతో వ్యయప్రయాసతో వరి పండించినా.. ధాన్యం పంట ఇంటికొచ్చే వరకు గ్యారంటీ లేదు. సునాముది, సంకుజోడి నీటివనరులు నిండితే చాలు గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో ఖరీఫ్ సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కోతల సమయంలోనూ భారీ వర్షాలు కురిస్తే గెడ్డ ప్రవాహం పెరిగి పంట ఇంటికి తెచ్చుకోలేని దుస్థితి నెలకొంది.

-జోగారావు, రైతు, డబారు

**కాజ్‌వే నిర్మించాలి..**



ఏటా ముమ్మరంగా వర్షాలు కురుస్తుండటంతో నీటి ఉధృతి కారణంగా పొలం పనులకు వెళ్లలేని దుస్థితి. నీటి ప్రవాహం తగ్గేవరకు ఇంటివద్దనే ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే కాజ్‌వే నిర్మించి రైతులను ఆదుకోవాలి.

-ఎస్.ప్రసాద్, రైతు, డబారు

**నిధులు వస్తే నిర్మాణం..**



రైతుల విన్నపం, స్థానిక ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాజ్‌వే నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి.. నివేదిక అందజేశాం. నిధులు విడుదలైన వెంటనే పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

-శ్రీనివాసరావు, ఏఈఈ, జలవనరుల శాఖ, మందస

## కొత్తమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

● ఆర్డీవో కృష్ణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీవో కృష్ణమూర్తి

కోటబొమ్మాళి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొత్తమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారుల మధ్య సమన్వయం అవసరమని ఉత్సవ నిర్వహణాధికారి, టెక్కలి ఆర్డీవో ఎన్.కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో జిల్లా అధికారులు, గ్రామ పెద్దలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మూడు రోజులూ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 21 నుంచి పురుషులతో పాటు మహిళల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్టు చెప్పారు. జాతర సందర్భంగా హెలీటూరిజాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దీనికి మూడు రోజుల పాటు 1000 మందికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు.

**భారీగా శోభాయాత్ర..**

'డీఆర్‌డీఏ పీడీ ఆధ్వర్యంలో సుమారు 30 రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో కొత్తపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి పెద్ద చెరువు వరకు 24న సాయంత్రం నాలుగు గంటలకు శోభాయాత్ర నిర్వహించనున్నాం. 25న 35 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నాం. గ్రామ పెద్దల సూచన మేరకు మంగళ, బుధవారాల్లో కూడా అన్నదానం నిర్వహించటానికి చర్యలు తీసుకుంటాం. క్రీడా మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మూడు రోజులు లేజర్ షో ఏర్పాటు చేయబోతున్నాం. ఈ ఉత్సవాలకు సుమారు రూ.3 కోట్లు వరకు ఖర్చు అవుతుంది. ఆర్థిక సాయం అందించాలనుకున్న దాతలు ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణకు ఇచ్చి రశీదు తీసుకోవాల'ని ఆర్డీవో సూచించారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించినవాల్‌పోస్టర్‌ను వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్‌డీవోలు ప్రత్యూష, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, డ్వామా పీడీ సుధాకర్ బాబు, అరసవెల్లి సూర్యనారాయణ ఆలయ డీసీ ప్రసాద్ పట్నాయక్, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, ఆలయ కమిటీ సభ్యులు కోరాడ చిన్నగోవింద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, గ్రామ పెద్దలు కల్లి నాగయ్యరెడ్డి, కల్లి లక్ష్మణరెడ్డి, బోయిన రమేష్, వెలమల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని

## 'ఉపాధి' మెరుగుపడేలా పాఠ్యాంశాల్లో మార్పులు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా డిగ్రీ కోర్సుల పాఠ్యాంశాల్లో (కరికులం) మార్పులు తీసుకురావాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫె సర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో అనుబంధ డిగ్రీ కళాశాలల బోర్డు ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) సమా వేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానం-2020 ప్రకారం డిగ్రీ అభ్యసన అంశాల్లో ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్‌ను తప్పనిసరిగా బోధించాల న్నారు. వర్సిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ డాక్టర్ కె.స్వప్న వాహిని మాట్లాడుతూ.. ఏఐ, మిషన్ లెర్నింగ్, కమ్యూనిటీ సర్వీసెస్, ఎన్విరాన్‌మెంట్ స్టడీస్ తదితర అంశాలు డిగ్రీ సబ్జెక్ట్‌ల్లో ఉండాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, సీడీసీ డీన్ ఎస్.ఉదయభాస్కర్, యూజీ పరీక్షల విభాగం డీన్ జి.పద్మారావు, అసిస్టెంట్ డీన్ కె.ఉదయకిరణ్, వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.కామరాజు, ఎస్‌వో డాక్టర్ కె.సామ్రాజ్యలక్ష్మి, 14 బోర్డుల యూజీ ఛైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

## 21 నుంచి ప్రైవేటు డిగ్రీ కళాశాలల సమ్మె

ఎచ్చెర్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల బోధనా రుసుమును ప్రభుత్వం చెల్లించలేదని, దీనికి నిరసనగా ఈనెల 21 నుంచి సమ్మె చేపడుతున్నట్లు ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొన్నాన జయరాం తెలిపారు. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్యకు మంగళవారం సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ.. 16 నెలలుగా 6 విడతల బోధనా రుసుం బకాయి లున్నాయన్నారు. దీనివల్ల కళాశాలల నిర్వహణ కష్టంగా మారిందన్నారు. తక్షణం తగు చర్యలు తీసుకుని బోధనారుసుం విడుదల చేయాలని కోరారు. బోధనా రుసుం చెల్లించేంత వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు కోత మురళీధర్, బింగు చిట్టిబాబు, ఎం.మోహనరావు, టి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి స్కూల్‌గేమ్స్ ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్-14, 17, 19 బాలబాలికల జిల్లా స్థాయి పోటీల షెడ్యూల్ విడుదల చేశారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తారు. ఈ నెల 20న కోడిరామ్మూర్తి స్టేడియంలో అథ్లెటిక్స్, ఆర్ట్స్ కళాశాలలో త్రోబాల్, సాఫ్ట్‌బాల్ ఎంపికలు జరుగుతాయి. 21న ఆర్ట్స్ కళాశాలలో హాకీ, పెద్దపాడులో వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, పలాసలో స్కేటింగ్, అరసవల్లిలోగల అర్చరీ అకాడమీలో అర్చరీ ఎంపికలు నిర్వహిస్తారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రగ్బీ, నెట్‌బాల్, రోప్ స్కిప్పింగ్, షూటింగ్‌బాల్ ఎంపికలు జరుగుతాయి. 22న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ (బాలురు), తొగరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హ్యాండ్‌బాల్, ఆర్ట్స్ కళాశాల మైదానంలో క్రికెట్, బాల్ బాడ్మింటన్ ఎంపికలు నిర్వహిస్తారు. ఈ నెల 23న ఆర్ట్స్ కళాశాల మైదానంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ (బాలికలు), శాంతినగర్ కాలనీలోని స్విమ్మింగ్‌పూల్‌లో స్విమ్మింగ్, టౌన్‌హాల్‌లో తైక్వాండో, ఫెన్సింగ్, ఎన్టీఆర్ మున్సిపల్ పాఠశాల మైదానంలో బాస్కెట్ బాల్ ఎంపికలు నిర్వహిస్తారు. 24న శ్రీకాకుళం శ్రీచైతన్య స్కూల్‌లో కరాటే ఎంపికలు నిర్వహించనున్నట్టు ఫెడరేషన్ ప్రతినిధులు తెలిపారు.





పతకాలు సాధించిన క్రీడాకారులు

## రాష్ట్ర స్థాయి పోటీల్లో సిక్కోలు ప్రతిభ

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి గట్కా ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచారు. శ్రీకాకుళం జిల్లా నుంచి 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 39 పతకాలతో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో జిల్లా నిలిచింది. ఇందులో 13 బంగారు పతకాలు, 23 రజత, మూడు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. జిల్లా గట్కా సంఘ అధ్యక్షులు బి.ఖగేశ్వరరావు, ఉపాధ్యక్షులు వి.శ్యామ్‌సుందరరావు, జనరల్ సెక్రటరీ బి.హర్షవర్ధన్, శిక్షకులు కె.సునీల్ కుమార్ విద్యార్థులను అభినందించారు.

## అంగన్‌వాడీలకు సన్నబియ్యం

(ఐదో పేజీ తరువాయి)

ఇంకా ఎంత అవసరమవుతాయనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. క్యూఆర్ కోడ్‌తో ఉన్న సన్నబియ్యం బస్తాలను అంగన్‌వాడీ కేంద్రాలకు అందించనున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ క్యూర్ కోడ్‌ను స్కాన్ చేసి ఎన్ని బస్తాలు దిగుమతి చేశారనే విషయాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

● **ప్రక్షాళన దిశగా..**

ఇప్పటికే మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మార్పు చేశారు. పలు రకాల పుస్తకాలు, వస్తువులను అందిస్తున్నారు. కేంద్రాల వద్దే కూరగాయలు పండించి వాటిని విద్యార్థులకు వండి పెట్టేలా కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటుకు రూ.10వేలు చొప్పున ప్రోత్సాహకాన్ని అందించారు. తాజాగా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సన్నబియ్యం అందించేలా చర్యలు చేపడుతున్నారు. సన్నబియ్యంతో భోజనం వండితే కేంద్రాల్లో అన్నం తినే పిల్లల సంఖ్య పెరుగుతుందని ఐసీడీఎస్ పర్యవేక్షకులు చెబుతున్నారు. ఈ విషయమై కొత్తూరు ఐసీడీఎస్ పీవో వి.ఉమాజానకి వద్ద ప్రస్తావించగా.. వచ్చే నెల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం పంపిణీ చేసే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉందన్నారు.

● **ఎక్కడి నుంచైనా..**

అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పోషకాహారాన్ని ఇకపై ఎక్కడి నుంచైనా పొందేలా ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇప్పటివరకు కేంద్రాలకు వచ్చిన వారికి మాత్రమే పోషకాహారం అందిస్తున్నారు. రానివారు ఆ నెలకు సంబంధించి పోషకాహార కిట్లు కోల్పోతున్నారు. ఇకపై ఈ రకమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండదు. పోషణ్ ట్రాకర్ యాప్‌లోనే మైగ్రేషన్ ఆప్షన్‌ను ప్రవేశపెట్టారు. దీంతో సరుకులు ఎక్కడి నుంచైనా పొందే అవకాశం ఏర్పడనుంది.

## మ్యాజిక్ డ్రెయిన్లు

(ఐదో పేజీ తరువాయి)

మండలం మెట్టవలస, మెళియాపుట్టి మండలం కొసమాళ, శ్రీకాకుళం మండలం శ్రీపురం(సానివాడ) పంచాయతీలు ఎంపికయ్యాయి. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు వినియోగించి ఈ పంచాయతీల్లో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

**పెరగనున్న భూగర్భ జలాలు..**

గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పారిశుధ్యాన్ని పూర్తిగా వదిలేసింది. కొన్ని గ్రామాల్లో కాలువలు లేక రోడ్డుపైనే మురుగు నీరు పారుతోంది. దీంతో తాగునీరు సైతం కలుషితమై గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలే పరిస్థితి కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ సమస్య పరిష్కారానికి మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వీటివల్ల మురుగు నీటి సమస్య పరిష్కారం కావడంతో పాటు భూగర్భ జలాలు కూడా పెరగనున్నాయి. సీసీ కాలువల నిర్మాణానికి 100 మీటర్లకు గాను రూ.4లక్షలు ఖర్చయితే మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణానికి కేవలం రూ.90వేలు మాత్రమే అవుతుంది. సిమెంట్ రహదారి పక్కన డ్రెయిన్ కోసం అరమీటరు వెడల్పు, రెండు మీటర్ల లోతున గొయ్యితీస్తారు. అందులో 75 నుంచి 100 ఎంఎం పరిమాణం ఉన్న సాధారణ రాళ్ల వేస్తారు. వాటిపై మూడు పొరలుగా కంకర పిక్కలు వేస్తారు. కాలువలో ప్రతి 30 మీటర్లకు ఒక సోక్‌పిట్ (గుంత) ఏర్పాటు చేసి, అందులో వివిధ పరిమాణాల్లో ముక్కరాయి వేస్తారు. దీనివల్ల ఎంత నీరైనా మ్యాజిక్ డ్రెయిన్‌లోకి వెళ్లి అక్కడే భూమిలోకి ఇంకుతుంది. ఫలితంగా మురుగునీటి సమస్య పరిష్కారం కావడంతో పాటు భూగర్భ జలాలు కూడా పెరుగుతాయి.

**తక్కువ ఖర్చుతో రెండు ఉపయోగాలు..**

తక్కువ ఖర్చుతో నిర్మించనున్న మ్యాజిక్ డ్రెయిన్లతో రెండు ఉపయోగాలు ఉన్నాయి. ఒకటి గ్రామంలో మురుగునీరు కనిపించకుండా చేయడం, రెండోది భూగర్భ జలాలు పెంచడం. వీటి నిర్మాణానికి ఉపాధిహామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులు వినియోగిస్తాం. ఇటీవల కొసమాళ గ్రామంలో పనులు ప్రారంభించేందుకు భూమిపూజ కూడా చేశాం.

-టి.రవి, ఏపీవో, మెళియాపుట్టి

**ఐదేళ్లు ఇబ్బందులు పడ్డాం..**



వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు మా పంచాయతీకి వచ్చిన నిధులు ఎక్కడ ఖర్చు చేశారో తెలియలేదు. మా గ్రామ సమస్యను కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకువెళ్లాం. దీంతో మొదటి విడతగా మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి మా గ్రామాన్ని ఎంపిక చేశారు. మురుగునీరు లేని గ్రామంగా తీర్చిదిద్దుకునే అవకాశం కల్పించారు. చాలా సంతోషంగా ఉంది.

-బొచ్చు ప్రసాదరావు, కొసమాళ

## ఆరోగ్యం, విద్యాభివృద్ధిపై సీఎం సమీక్ష

(ఐదో పేజీ తరువాయి)

క్యాన్సర్.. 2,132 మంది అనుమానితుల్లో 1,805 మందికి పరీక్షించి.. 16 మందిని రిఫర్ చేశారు.

● మహిళా శిశు సంక్షేమానికి సంబంధించి 3,385 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెల 1.14 లక్షల మంది లబ్ధిదారులకు పోషకాహారం అందిస్తున్నారు. బాల్య వివాహాలను నిర్మూలించేందుకు.. 'శక్తి టీమ్స్' ఏర్పాటు చేశారు.

● స్కూల్, కాలేజీలకు హాస్టల్ సౌకర్యాలు, ల్యాబ్ సదుపాయాలు పెంచాలని సీఎం సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించారు. మహిళల రక్షణకు శక్తిసదన్, వన్‌స్టాప్ సెంటర్‌ల ద్వారా సహాయాన్ని బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లాకు సంబంధించి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా ఓజోన్ పొర పరిరక్షణ దినం

ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని మంగళవారం జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ఓజోన్, ఓ3 ఆకారాల్లో మానవహారం నిర్వహించి ఆకట్టుకున్నారు. ఓజోన్ ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉపాధ్యాయులు వివరించారు.

-ఆంధ్రజ్యోతి బృందం


ఇచ్ఛాపురం: ఓ3 ఆకారంలో కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు


సంతబొమ్మాళి: కొల్లిపాడు జడ్పీ పాఠశాలలో..


పొందూరు: తోలాపి పాఠశాలలో..


నరసన్నపేట: సత్యవరంలో


కాశీబుగ్గ: చినబాడం ఉన్నత పాఠశాలలో..


కోటబొమ్మాళి: జిల్లా పరిషత్ పాఠశాలలో..


లావేరు: బుడుమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో..


నందిగాం: లఖిదాసుపురం ఉన్నత పాఠశాలలో..

## న్యూస్ బాక్స్

### హుండీల ఆదాయం రూ.3.55 లక్షలు

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నారాయణ తిరుమల వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీలను మంగళవారం లెక్కించారు. గ్రూపు దేవాలయాల ఈవో ఎం.సుకన్య పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో రూ.3,55,841 ఆదాయం వచ్చినట్లు ఈవో సన్యాసిరావు తెలిపారు. ఈ మొత్తం 113 రోజులకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యులు, ఆలయ అర్చకులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నేటి నుంచి విశ్వకర్మ ఆరాధనోత్సవాలు

శ్రీకాకుళం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ ఆరాధనా మహోత్సవాలు బుధవారం నుంచి జీటీ రోడ్డులో నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు సోపింటి తారకేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలను బుధవారం నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. విశ్వబ్రాహ్మణులు తప్ప నిసరిగా హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### విశ్వకర్మ యజ్ఞానికి రండి

సోంపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అమరావతిలో బుధవారం నిర్వహించనున్న విశ్వకర్మ యజ్ఞా నికి రావాలని ఆ సంఘ నేతలు పలువురిని ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం ఆహ్వాన పత్రికల ను స్వర్ణశిల్పి సంఘం రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు తదితరులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దున్న శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ డీఏలను చెల్లించాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి



ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. భానుమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద సంఘ ప్రతినిధులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్క రించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. 12వ పీఆర్సీని నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు. అనంతరం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతి నిధులు మజ్జి మదన్‌మోహన్, చావలి శ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్, ఎస్. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

### దసరా కానుకగా ఐఆర్ ప్రకటించాలి


మాట్లాడుతున్న ఏపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

రణస్థలం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ డిమాండ్ చేశారు. సభ్యత్వ అభియాన్‌లో భాగంగా మంగళవారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023లో వేయాల్సిన 12వ పీఆర్సీ కమిటీని ఇంతవరకు నియమించకపోవడం దారుణమన్నారు. దీనివల్ల రెండేళ్ల పీఆర్సీ కాలాన్ని నష్టపోయారన్నారు. సంఘం జిల్లా పూర్వ అధ్యక్షుడు జి.వెంకటగిరి కాంప్లెక్స్ స్థానాల్లో పనిచేస్తున్న గణిత, ఆంగ్ల ఉపాధ్యాయులకు శాశ్వత స్థానాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు జి.చిన్నికృష్ణంనాయుడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగాల పేరిట దంపతుల మోసం

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాలిప్పిస్తామని డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తి అతని ఇద్దరు భార్యలపై శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసులు మంగళవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శ్రీకాకుళం హడ్కో కాలనీకి చెందిన జీవీ నరసింహ డీఎంహెచ్‌వో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. అతనితో పాటు ఇద్దరు భార్యలు మంగువారితోటకు చెందిన తురకల కిశోర్, అతని బావ మరిది, మరో ఇద్దరు వ్యక్తులకు స్టాఫ్‌నర్సు, ఎంఎస్‌వో, ఎఫ్ఎన్‌వో ఉద్యోగాలిప్పిస్తానని చెప్పి వారి వద్ద నుంచి సుమారు రూ.8 లక్షలు వసూలు చేశారు. అయితే సదరు వ్యక్తులకు అనుకున్న ఉద్యోగాలు ఎప్పటికీ రాకపోవడంతో మోసపోయామని గ్రహించి శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తురకల కిశోర్ ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

### టెక్కలి ఐఎంఎల్ డిపోను రద్దు చేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీయవద్దని, టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు ఉత్తర్వులను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నా యుడు, పి.తేజేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో కార్మికులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్వో ఎం.వేంకటేశ్వర రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, హమాలీల యూనియన్ నాయకులు డి.బంగార్రాజు, టి.రామారావు, ఎన్.సురేష్, ఎన్. రమణ తదితరులు పాల్గొన్నారు.

### చురుగ్గా వంతెన పనులు


మహేంద్రతనయ నదిపై జరుగుతున్న పనులు

సోంపేట రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో భాగంగా రోడ్డు, వంతెన పనులు చురుగ్గా సాగుతున్నాయి. మందస, సోంపేట మండలాల పరిధి రట్టి నుంచి సోంపేట మండలం సిరిమామిడి, మామిడిపల్లి, గొల్లూరు, మూలపొలం మీదుగా బారువ వరకు 7.55 కోట్లతో పదిన్నర కిలోమీటర్ల రహదారి, బారువ వద్ద మహేంద్రతనయ నదిపై వంతెన పనులు చేపడు తున్నారు. రట్టి నుంచి మూలపొలం వరకు బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. మహేంద్రతనయ నది, కొండిరేవులపై వంతెన నిర్మాణం పనులు సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

### ప్రమాదకరంగా మలుపు

గార రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉప్పరిపేట ఉప్పు గెడ్డ వంతెన వద్ద మలుపు అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2012లో మలుపు వద్ద వంతెన నిర్మాణానికి ప్రణాళికలు చేసినా నేటికీ అమలుకాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా ఉన్న మలుపు

## సమన్వయంతో అభివృద్ధి పనులు

● ఎమ్మెల్యేలు రవికుమార్, శంకర్


శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్

ఆమదాలవలస, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస మునిసిపాలిటీ పరిధిలోని శ్రీకాకుళం నియోజకవర్గంలో ఉన్న ప్రాంతాలను సమన్వయంతో అభివృద్ధి చేస్తామని ఆమదాలవలస, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్ అన్నారు. మంగళవారం మునిసిపాలిటీ పరిధిలోని మూడు, నాలుగు, ఆరు, ఏడు వార్డుల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని పల్లెల కు రోడ్ల సదుపాయం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశలో చర్యలు చేపడు తోందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రధాన రహదారులతో పాటు గ్రామాల్లోని వీధి రోడ్లు కూడా అధ్వానస్థితికి చేరుకున్నాయన్నారు. కూ టమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం చంద్ర బాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో రోడ్ల అభివృద్ధికి చర్య లు చేపట్టడం జరిగిందన్నారు. దీనిలో భాగం గా ఇప్పటివరకు శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గంలో సుమారు రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే పట్టణంలోని 8, 18, 19, 20, 21 వార్డు ల్లో చేపట్టనున్న సీసీ రోడ్లు కాలువల నిర్మాణా నికి ఎమ్మెల్యే రవికుమార్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిషనర్ తమ్మినేని రవి, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, రాష్ట్ర మెడికల్ బోర్డు సభ్యుడు చాపర సుధాకర్, టీడీపీ నేత మొదలవలస రమేష్, కూన ఆంజనేయులు, బోర గోవిందరావు, జనసేన సమన్వయకర్త పేడాడ రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ సంక్షేమం: శంకర్

శ్రీకాకుళం అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఇంజినీరింగ్, మునిసిపల్, రెవెన్యూ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రజల సమస్యలపై తక్షణం స్పందించాలని, సచివాలయాలకు వచ్చే వారికి సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

● తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.బసవరాజు


మాట్లాడుతున్న బసవరాజు

అరసవల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పని చేస్తున్న కెప్టెన్లు (డ్రైవర్లు)కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.బసవరాజు అన్నారు. డ్రైవర్లకు స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలతో మారుమూల ప్రాంతాల్లో, సమయంతో నిమిత్తంలేకుండా సేవలందిస్తున్నామని, కాని మా సేవలను గుర్తించడంలో ప్రభు త్వం విఫలమైం దన్నారు. అరబిందో యాజమాన్యం పదేళ్లుగా అతి తక్కువ వేతనం ఇస్తోందని, నిత్యావసర వస్తువులు పెరుగుతున్నా వేతనాలు పెరగకపోవడతో జీవనం దుర్భరమవుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రమాద బీమా, ఎక్స్‌గ్రేషియా, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.దశరథరావు, ఎం.మణికంఠ, పలువురు సంఘ ప్రతినిధులు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

### సొంత ఇంటికోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పీఎంఏవై 2.0 అంగీకార్-2025లో భాగంగా పట్టణ ప్రాంతాల్లో అర్హులై ఉండి ఇళ్లు లేనివారికి ఇళ్లు మంజూరు చేయనున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఎన్. రమేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కార్యాలయంలో పీఎంఏవై అవగాహన కరపత్రికలకు ఆవిష్కరించారు. అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ విషయమై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవ గాహన కలిగించాలని సిబ్బందికి సూచించారు. అలాగే పీఎంజీఏవై 1.0 కింద గత ఏడాది లబ్ధిపొందిన వారు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పీఎంఏవై సూర్యఘర్ సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మెప్మా సిబ్బంది, సీఎల్‌టీసీ తదితరులు పాల్గొన్నారు.

### 'శ్రీకూర్మం' ట్రస్టు బోర్డు నియామక ఉత్తర్వులు

గార, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ క్షేత్రం శ్రీకూర్మనాథ స్వామి ఆలయ పాలకవర్గ సభ్యుల నియామకానికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్షేత్రం ట్రస్టు బోర్డు నియామకానికి గాను ఈ నెల 1న రాష్ట్ర దేవదాయశాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ డాక్టర్ ఎం. జవహర్‌లాల్ పేరుతో విడుదలైన జీవో మేరకు దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ తుది ఉత్తర్వులిచ్చినట్లు ఈవో కె.నరసింహనాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### ఒక్క మెడికల్ కాలేజీ అయినా తీసుకువచ్చారా?

శ్రీకాకుళం అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏర్పాటైన మెడికల్ కళాశాలలతో సీఎం చంద్రబాబు నాయుడుకు ఎటువంటి సంబంధం లేదని, ఆయన సీఎంగా పనిచేసిన నాలుగు పర్యా యాల్లో ఒక్క కాలేజీనైనా తీసుకువచ్చారా అని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. మంగళవారం వైసీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం అన్యాయమన్నారు.

### ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

జి.సిగడాం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ వై.మల్లిబాబు అన్నారు. మంగళవారం పొందూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జి.సిగడాం, సంతవురిటి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మధుమేహ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తీసుకున్న ఆహారంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫాస్ట్‌ఫుడ్, పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు ఎ.ధర్మారావు, వడ్డిపల్లి సూర్యనారాయణ, విశ్రాంత డీఈ ఎ.విజయకుమార్, పి.దివాకర్ పాత్రో పాల్గొన్నారు.

### దుకాణాల్లో డాగ్ స్క్వాడ్ తనిఖీ

రణస్థలం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గంజాయి నియంత్రణ చర్యల్లో భాగంగా మంగళవారం కోష్ట జంక్షన్‌లో పలు దుకాణాల్లో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ తనిఖీ చేపట్టింది. కిరాణా దుకాణాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయేమోనన్న అనుమానంతో నిశితంగా పరిశీలించారు. కార్యక్రమంలో జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి పాల్గొన్నారు.

### బైక్ చోరీకి పాల్పడిన ఇద్దరికి జైలుశిక్ష

శ్రీకాకుళం లీగల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన మోటార్ సైకిల్ చోరీ కేసులో ఇద్దరికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కె. అనురాగ్ మంగళవారం తీర్పు ఇచ్చారు. ఈ ఏడాది బైక్ దొంగతనం చేసిన ధమరసింగి అఖిల్ సాయి, దువ్వ భానుప్రసాద్‌లపై ఎస్ఐ ఎం. హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున ఎల్.నాగ భూషణరావు వాదించారు. నిందితులపై నేరం రుజువు కావడంతో ఏడాది సాధారణ జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

### దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు

ఇచ్ఛాపురం/కంచిలి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు సమగ్రశిక్ష కోఆర్డినేటర్ బి.గోవిందరావు, ఎంఈవోలు అప్పారావు, శివరాంప్రసాద్, చిట్టిబాబు వేర్వేరు ప్రకటల్లో తెలిపారు. ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సంబంధించి ఈ నెల 19న ఇచ్ఛాపురంలో వైద్యశిబిరం నిర్వ హించి ఉపకరణాలకు ఎంపికలు చేస్తామన్నారు. నియోజకవర్గంలోని దివ్యాంగ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లల అర్హత నిర్ధారణ నిమిత్తం విద్యార్థి ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం, విద్యార్థి ఫొటో తీసుకుని రావాలని వారు ఆ ప్రకటనల్లో సూచించారు.


### విద్యార్థిమిత్ర గుర్తింపు పూర్తి చేయాలి

కవిటి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర విద్యార్థుల గుర్తింపును పూర్తి చేయాలని ఎస్ఎస్ఏ అధికారులు సూచించారు. స్థానిక ఎమ్మార్సీని మంగళవారం ఎస్ఎస్ఏ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్ బి.గోవిందరావు, ప్రత్యామ్నాయ పాఠశాలల కోఆర్డినేటర్ కె.రామ కృష్ణ, జీసీడీవో డి.రమాదేవి ఎంఈవోలతో పలు అంశాలపై చర్చిం చారు. ఎంఈవోలతో చర్చించారు. స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్ నిమిత్తం పాఠశాలలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచిం చారు. ఈనెల 19న నియోజకవర్గస్థాయిలో ఇచ్ఛాపురంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని, దీనిని వారంతా సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ధనుంజయ మజ్జి, ఎస్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### నేడు మండల సమావేశం

జి.సిగడాం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.రామకృష్ణ తెలిపారు. ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన జరగనున్న ఈసమావేశానికి ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని, అధికారులు పూర్తి సమాచారంతో రావాలని కోరారు.

# తలుపులకు చెదపట్టి.. శ్లాబు పెచ్చులూడి


శిథిలావస్థకు చేరుకున్న కార్యాలయం

● భయాందోళనల మధ్య విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ● ఇదీ జలుమూరు వ్యవసాయశాఖ కార్యాలయం పరిస్థితి

జలుమూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):జలుమూరులోని వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. దశాబ్దాల కిందట నిర్మించిన భవనం కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో తలుపులకు చెదలుపట్టాయి. శ్లాబు పెచ్చులూడి పడుతుండడంతో సిబ్బంది భయాందోళనల మధ్య విధులు నిర్వహిస్తున్నారు.

జలుమూరులో కొండ పక్కన ఇరవై ఏళ్ల కిందట వ్యవసాయశాఖ కార్యాలయం గోదాముకు భవనం నిర్మించారు. కింద భాగం గోదాముకు, పైన కార్యాలయంగా వినియోగానికి భవనం నిర్మించారు. కొన్నాళ్లు పాటు కింద గోదాముగా ఉపయోగించి వ్యవసాయ పరికరాలు, టార్పాలిన్లు ఉంచేవారు. భవనం నిర్మించిన తర్వాత కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. తలుపులు, కిటికీలు చెదలుపట్టాయి. కొండ పక్కనే గోదాము ఉండడంతో విషసర్పాలు, క్రిమికీటకాలు చేరేవి. దీంతో తలుపులు తేరవడానికి సిబ్బంది భయాందోళనలు చెందేవారు. పైభాగంగాలో కార్యాలయానికి వినియోగించిన భవనం శ్లాబు పెచ్చులూడుతుండడంతో ఏ క్షణంలో ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని సిబ్బంది బిక్కుబిక్కుమని విధులు నిర్వర్తించేవారు. జలుమూరులో వెలుగుకార్యాలయ భవనం ఖాళీగా ఉండడంతో మండలస్థాయి అధికారులు వ్యవసాయ కార్యాలయ వినియోగానికి దాన్ని ఇవ్వాలని సిబ్బంది కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వ్యవసాయ కార్యాలయ భవనం నిర్మాణానికి నిధులు మంజూరుకు చర్యలుతీసుకోవాలని సిబ్బంది, రైతులు కోరుతున్నారు.

## నమ్మించి.. మోసం చేసి

● ఆరేళ్లు కాపురం.. ఓ మగబిడ్డకు జన్మ ● పనికి వెళ్తానని చెప్పి పరారైన వైనం ● ప్రియుడి ఇంటి ముందు బాధితురాలి నిరసన

లావేరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆమెకు పెళ్లయి ఓ బాబు ఉన్నాడు. జీవితం ఎంతో సాఫీగా సాగిపోతున్న వేళ ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ వ్యక్తి కారణంగా ఆమె జీవితం తలకిందులైంది. కంటికి రెప్పలా చూసుకుంటానని చెప్పడంతో నమ్మి భర్తను వదిలి అతని దగ్గరికి వెళ్లింది. ఇద్దరూ పెళ్లి చేసుకుని ఆరేళ్లు కాపురం చేశారు. ఓ మగబిడ్డకు జన్మనిచ్చారు. ఇంతలో మరో యువతితో పెళ్లికి సిద్ధమయ్యాడు ప్రియుడు. దీంతో తనకు న్యాయం చేయాలని వేడుకుంటూ ప్రియుడి ఇంటి ముందు బాధితురాలు నిరసనకు దిగింది. ఈ ఘటన మండల పరిధిలోని చిగిరి కొత్తపల్లిలో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చిగిరికొత్తపల్లికి చెందిన ఎర్ర శంకర్‌కు మండలంలోని మరో గ్రామానికి చెందిన దళిత మహిళకు 2019లో ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆమెకు అప్పటికే వివాహమైంది. భర్తతోపాటు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. శంకర్ పదేళ్లుగా హైదరాబాద్‌లోని ఓప్రైవేటు కెమికల్ పరిశ్రమలో కెమిస్టుగా పనిచేస్తున్నాడు. శంకర్‌కు, ఆమె మధ్య ఏర్పడిన ఫేస్‌బుక్ స్నేహం బలపడింది. భర్తకు విడాకులిచ్చి హైదరాబాద్ వచ్చేయాలని పదే పదే ఆమెపై ఒత్తిడి తెచ్చేవాడు. ఈనేపథ్యంలో రెండేళ్ల బాబును తీసుకుని ఆమె హైదరాబాద్ చేరుకుంది. అక్కడ ఓ ఆలయంలో వివాహం చేసుకున్నారు. ఆరేళ్లు వారి దాంపత్య జీవితం సాఫీగా సాగింది. ఓ బాబు కూడా పుట్టాడు. అయితే, బీసీసామాజికవర్గానికి చెందిన శంకర్ ఓ వ్యక్తి ప్రోద్బలంతో దళితమహిళను ఎలాగోలా వదిలించుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఏడాది కిందట విజయనగరంజిల్లా పూసపాటిరేగ మండలానికి చెందిన ఓయువతిని అడిగి పెద్దలసమక్షంలో పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఈ విషయం బాధితురాలికి తెలియడంతో ఆమె ఒక్కసారి షాకై శంకర్‌ను ప్రశ్నించింది. ఎంతవారించినా ఆమె మాటను దాటవేసి అతని కులానికి చెందిన యువతితో పెళ్లికి సిద్ధపడ్డాడు. ఇంతలో శంకర్ పైడిభీమవరంలోని ఓ కెమికల్ పరిశ్రమకు బదిలీపై ఈఏడాది మేలో వచ్చాడు. అప్పటికే శంకర్ పెళ్లి ముహూర్తం దగ్గరపడడంతో దంపతుల మధ్యమనస్పర్థలు తారాస్థాయికి చేరాయి. ఈనేపథ్యంలో హైదరాబాద్ నుంచి పైడిభీమవరం వచ్చి ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఇద్దరు పిల్లలతో ఉండేవారు. శంకర్ పెళ్లికి అడ్డు కట్ట వేయాలని భావించిన బాధితురాలు లావేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. అయితే, తాను పెళ్లి చేసుకోవాలని భావించిన యువతితో శంకర్ ఈఏడాది మేలో హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు. అప్పట్లో లావేరు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసి శంకర్‌ను తీసుకుని వచ్చి బాధితురాలికి అప్పగించారు. పెద్దల సమక్షంలో కుదిరిన ఒప్పందం మేరకు ఇద్దరూ గత మూడు నెలలుగా ఒకే ఇంటిలో కాపురం ఉన్నారు.

**పరారైన శంకర్**

భార్యను పైడిభీమవరంలోని ఇంటిలో వదిలేసి పనికి వెళ్లి వస్తానని చెప్పి ఈనెల 4న ఇంటి నుంచి బయటకు వెళ్లిన శంకర్ తిరిగి రాలేదు. దీంతో ఏం చేయాలో తోచక వారం రోజుల కిందట శ్రీకాకుళం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో బాధితురాలు ఫిర్యాదుచేసింది. తన గోడును మీడియా ముందు వెళ్లగక్కింది. ఈ నేపథ్యంలో శంకర్‌ను తనకు అప్పగించాలని కోరుతూ ఆమె చిగిరి కొత్తపల్లిలోని అతని ఇంటి ముందు మంగళవారం నిరసనకు దిగింది. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ఈవిషయమై గతంలో ఎస్పీ గ్రీవెన్స్‌కు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు తన దృష్టికి వచ్చిందని, దీనిని పరిశీలిస్తున్నామని జేఆర్‌పురం ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

## 16 కిలోల గంజాయి స్వాధీనం

● సాగుదారుడు, కొనుగోలుదారులపై కేసు నమోదు
● కిలోకు రూ.ఐదు వేలు ఇస్తామని ఆశచూపడంతో తరలింపు

పలాస, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కిలో గంజాయికి రూ.ఐదువేలు ఇస్తామని పేర్కొనడంతో ఒడిశాలోని రాయగడ జిల్లా జగిడిపదర్ గ్రామానికి చెందిన హేమంత్‌సబార్, కేశబ్‌సబార్‌లు 16.800 కిలోల గంజాయి రవాణా చేస్తుండగా పలాస రైల్వే స్టేషన్ రోడ్డులో సోమవారం ఉదయం పట్టుబడ్డారు. సీఐ పి.సూర్యనారాయణ కథనం మేరకు...హేమంత్‌సబార్, కేశబ్‌సబార్‌లు జాజ్‌పూర్‌కుచెందిన అముస్‌తో పరిచయం పెంచుకున్నారు.ఆయన గంజాయి సాగుచేస్తున్నాడు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు బ్రోకర్లతో రవాణాచేస్తున్నాడు. ఈక్రమంలో హేమంత్‌సబార్, కేశబ్‌సబార్‌కి గంజాయి రవాణాతో లాభాలు సాధించవచ్చని, కిలో గంజాయి తీసుకువెళ్లి అనుకున్న ప్రాంతానికి చేర్పిస్తే రూ.ఐదు వేలు ఇస్తామని చెప్పడంతో 16 కిలోల 800 గ్రాముల బరువున్న గంజాయిని ఆయన వద్ద తీసుకున్నారు. అనంతరం స్కూల్‌బ్యాగుల్లో వాటిని పెట్టి పలాస రైల్వేస్టేషన్ రోడ్డుకు చేరుకున్నారు.ఈక్రమంలో ఆప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ నర్సింహమూర్తి వారిని అనుమానించి బ్యాగులు తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. వీరిని అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ గంజాయిని తమిళనాడు రాష్ట్రం ఉక్కడం గ్రామానికి చెందిన సంజురేతోకు అందించాల్సి ఉంది.పండించిన రైతుతోపాటు కొనుగోలుదారులపై కూడా కేసు నమోదు చేశారు. వీరు గతంలో కూడా గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడకుండా తప్పించుకున్నారు. పలాస కోర్టులో హాజరుపరిచారు.

## సూదికొండకాలనీలో బాలుడి అదృశ్యం


సందీప్

పలాస, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల పరిధిలోగల సూదికొండకాలనీలో నివాసముంటున్న బాలుడు గజపతి సందీప్ అదృశ్యమయ్యాడు. ఈమేరకు ఏడో తరగతి చదువుతున్న సందీప్ రెండు రోజుల నుంచి కనిపించడం లేదని బంధువు కొర్రాయి సుజాత కాశీబుగ్గ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. తన భర్త షణ్ముఖరావుకు ముగ్గురు అన్నదమ్ములు, ఇద్దరు అక్కలు ఉన్నారని, ఆడపడుచు, మరిది ఇద్దరూ మరణించడంతో వారి పిల్లలు స్వాతి, సందీప్‌లు తన వద్దే చదువుతున్నారని సుజాత ఫిర్యాదులో పేర్కొంది. ఈక్రమంలో సందీప్ స్కూల్‌కు వెళ్లి రాలేదని, ఈ నెల 13న ఇంటికి ఎంతకీ రాకపోయే సరికి పాఠశాలకు వెళ్లి తీసుకువచ్చి మందలించామని తెలిపింది. 14న సందీప్ గజపతి జిల్లా బతిసిరిపూర్ వెళ్తానని చెప్పి బట్టలు, బ్యాగుతో వెళ్లి చేరలేదని పేర్కొంది. కుటుంబ సభ్యుల ఇళ్లలో వెతికామని తెలిపింది. ఈ నేపథ్యంలో సందీప్ ఆచూకీకోసం ఆమె పోలీసులకు ఫిర్యాదుచేశారు. సీఐ పి.సూర్యనారాయణ కేసు నమోదుచేశారు.

## పారిశుధ్య పనులు చేపట్టాలి

జలుమూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంధవరం పంచాయతీలో తక్షణమే పారిశుధ్యం పనులు చేపట్టాలని గ్రామస్థులు, మహిళలు మంగళవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. గ్రామ సచివాలయానికి వెళ్లిన రహదారి పక్కన, రామకృష్ణాపురం వద్ద చెత్త, మురుగునీరు ఉన్నా అధికారులు, సర్పంచ్ పట్టించుకోకపోవడం లేదని వాపోయారు. సమాచారం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అంధవరం చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. తక్షణమే పారిశుధ్య పనులు చేపడతామని హామీఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.


అంధవరంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళలు

## బాలలకు పౌష్టికాహారం అందించండి: ఎమ్మెల్యే


అంగన్‌వాడీ సహాయకురాలికి నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎల్.ఎన్.పేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలలకు పౌష్టికాహారాన్ని అందించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఎంపికైన సిబ్బంది అంకితభావంతోపనిచేసి భావితరాలకు ఆదర్శంగా ఉండాలని కోరారు.మంగళవారం ఎల్.ఎన్.పేటమండలంలోని బొత్తాడసింగి పంచాయతీ పరిధిలోని పూశాం అంగన్‌వాడీకేంద్రం సహాయకురాలిగా ఎంపికైన కె.జ్యోతికి పాత పట్నంలోని క్యాంపు కార్యాలయంలో నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కొత్తూరు డివిజన్ ఐసీడీఎస్ సీడీపీవో వి.ఉమాజానకి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బాబుకిషోర్, ఎ.పోలినాయుడు, కె.తిరుపతిరావు పాల్గొన్నారు.

## నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

పలాస, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్వాసితుల ఇళ్ల స్థలాలకు సంబంధించిన ప్రతిబంధకాలు తొలగించి సమస్యలు పరిష్కరిస్తామని టీడీపీ నాయకులు తెలిపారు.సోమవారం సూదికొండకాలనీవారి స్థలాల ఆవరణలో నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఏపీట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు మాట్లాడుతూ 2019కు ముందే బ్రిడ్జి పూర్తి కావాల్సి ఉందని, అనుకోని సంఘటనల వల్ల ఆలస్యమైందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవ తీసుకొని గతంలో పనిచేసిన కాంట్రాక్టర్ల బిల్లులుచెల్లించారని తెలిపారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్లి రైల్వేశాఖ ఆధీనంలో రూ.48 కోటతో బ్రిడ్జి పనులు చేపట్టేలా చొరవ తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, ఎం.నరేంద్ర, గురిటి సూర్యనారాయణ, అంబటి కృష్ణమూర్తి ప్రసంగించగా, కొరికాన శంకర్, కొత్త సత్యం, పైల చక్రధర్, సవర రాంబాబు, డొక్కరి శంకర్ పాల్గొన్నారు.

### ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కోటబొమ్మాళి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిన్న హరిశ్చంద్రపురంలో ఏపీజీవీపీ జర్జంగి బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆర్థికఅక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది బి.దుర్గాప్రశాంత్, పార్వతీశ్వరరావు, ఐ. వరప్రసాద్, గ్రామపెద్దలు ఉప్పాడ జయరాం పాల్గొన్నారు.

## భారత్ విద్యా సంస్థలతో భాగస్వామ్యానికి సిద్ధం

● ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ మార్క్ లామి


మాట్లాడుతున్న జనరల్ మార్క్ లామి

నెల్లిమర్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): భారత్‌లోని విద్యా సంస్థలతో భాగస్వామ్యానికి ఫ్రాన్స్ ఎళ్లప్పుడూ సిద్ధమని ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ మార్క్ లామి తెలిపారు. మంగళవారం నెల్లిమర్లలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నైపుణ్యాలను పెంపొందించేందుకు యూనివర్సిటీ నిర్వహిస్తున్న అనుబంధ కార్యక్రమాలను అభినందించారు. ఫ్రాన్స్ వివిధ విద్యాసంస్థలతో నైపుణ్యాల పెంపుదలకు కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సెంచూరియన్ వైస్ ప్రెసిడెంట్ డీఎన్ రావు, చాన్స్‌లర్ జీఎస్ఎన్.రాజు, వైస్ చాన్స్‌లర్ ప్రశాంత్‌కుమార్ మహంతి, రిజిస్ట్రార్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం నిలదీత

టెక్కలి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి):ఖరీఫ్‌లో రైతులు అవసరాల కోసం యూరియా అందించడంలో అధికారులు విఫలమయ్యారని, అధికార పార్టీకి చెందిన కొందరు యూరియాను కమీషన్లకోసం పక్కదారి పట్టించారని జడ్పీటీసీ దువ్వాడ వాణితోపాటు వైస్ఎంపీపీ పేడాడ రమేష్, ఎంపీటీసీ ఉషారాణి, పలువురు సర్పంచ్‌లు ఆరోపించారు. మంగళవారం టెక్కలి మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏవో ఎం.శ్రీనివాసరావును యూరియాపై సభ్యులు నిలదీశారు. మండలంలో ఈనెల 18 నుంచి అక్టోబరు ఐదో తేదీ వరకు మహిళల కోసం వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు లింగాలవలస పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యశ్రీ తెలిపారు.అలాగే మావోయిస్టు కార్యదర్శి నంబాళ్ల కేశవరావు మృతిచెందడంతో టెక్కలిలో ఆయన స్థూపం నిర్మాణానికి సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానించారు. మాజీ ఎంపీపీ తిర్లంగి జానకిరామయ్య మృతికి తెలిపారు. సమావేశంలో ఎంపీపీ ఆట్ల సరోజినమ్మ, ఎంపీడీవో ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

### స్థానిక రైతులకు యూరియా ఇవ్వండి

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):పూండిలో ప్రైవేటు ఎరువుల దుకాణం వద్ద రైతులు యూరియాకోసం అగచాట్లకు గురయ్యారు.ఇక్కడి రైతులకు ఎరువులు ఇవ్వకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు యూరియా సరఫరా చేస్తున్నారని స్థానిక రైతులు అధికారులు, వ్యాపారులను నిలదీశారు. సోమవారం సచివాలయం నుంచి టోకెన్లు తీసుకొచ్చి మహాదేవపురం రైతులు పూండిలోని ఎరువుల దుకాణంనుంచి యూరియా తీసుకున్నారు.కొంతమంది రైతులు వేలిముద్రలు సక్రమంగా పడకపోవడంతో వారు మళ్లీ మంగళవారం యూరియాకోసం వచ్చారు. విషయం తెలుసుకున్న గోవిందపురం రైతులు స్థానిక రైతులకు యూరియా ఇవ్వకుండా ఇతరప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు యూరియా ఇస్తున్నారని అధికారులు, వ్యాపారులు నిలదీయడంతో కొంతసమయం యూరియా పంపిణీ నిలిచిపోయింది. దీంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ సీతారామయ్య, ఎస్‌ఐ నిహార్, ఏవో ధనుంజయలు వచ్చి రైతులను సర్దిచెప్పి అర్హతఉన్న రైతులందరికీ యూరియా అందిస్తామని చెప్పడంతో శాంతించారు.

## విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం


ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న కళాశాల అధ్యాపకులు

టెక్కలి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సత్ప్రవర్తనతోపాటు క్రమశిక్షణ అవసరమని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఆర్.జనార్దనరావు తెలిపారు. మంగళవారం టెక్కలిలోని విశ్వజ్యోతి డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఫేర్‌వెల్‌డే నిర్వహించారు.ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పినకాన జోగారావు, ఎస్‌వీఆర్‌కే చైర్మన్ ఉమామహేశ్వరరావు, కొసింటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రాట్యూటీ జీవోలో మార్పులు చేయాలి

హిరమండలం, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం హిరమండలంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్,హెల్పర్స్ యూనియన్ కొత్తూరు ప్రాజెక్టు మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రాట్యూటీ జీవోలో మార్పులుచేయాలని కోరారు.హెల్పర్ల ప్రమోషన్లకు విధివిధానాలు రూపొందించాలన్నారు.ఈసందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కొత్తూరు ప్రాజక్టు కమిటీ అధ్యక్షురాలిగా కె.లక్ష్మి, గౌరవాధ్యక్షులిగా ఆర్.పద్మరాణి, ప్రధానకార్యదర్శిగా కేవీహేమలత, ఉపాధ్యక్షులు,సహాకార్యదర్శులుగా ఎం.సుదీప్త,ఆర్.అరుణలతో పాటు 25 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు పాల్గొన్నారు.

## కోనేరులో చెత్త తొలగింపు


చెత్త తొలగిస్తున్న మహిళలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోటబొమ్మాళి, సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): యరకాని కోనేరులో గట్టు చుట్టూ ఏళ్ల తరబడి ఉన్న చెత్తతొలగించి శుభ్రం చేశారు. నిర్వహణలేక... పూడిక పేరుకుపోయి శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితంకావడంతో పంచాయతీ కార్యదర్శి చింతాడ సన్యాసిరావు స్పందించి చెత్త తొలగించారు.

### నేడు మండల సమావేశం

హిరమండలం,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):హిరమండలం మండల సమావేశాన్ని బుధవారం ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కాశీప్రసాదరావు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

### నేటి నుంచి పోషణ మాసోత్సవాలు

టెక్కలి రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోషణ మాసోత్సవాలు బుధవారం నుంచి అక్టోబరు 16 వరకు నిర్వహించనున్నట్లు టెక్కలి ఐసీడీఎస్ పీవో విద్య తెలిపారు. ఈ సందర్భంగా స్థూలకాయ నివారణకు చెక్కర, నూనె వినియోగం తగ్గించడం, బాల్య దశలో పోషణ, సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

### నేడు విశ్వకర్మ జయంతి

నందిగాం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):నందిగాంలోని వీరబ్రహ్మేంద్రస్వామి మందిరంలో బుధవారం విశ్వకర్మ జయంతి నిర్వహించనున్నట్లు సంఘ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలి పారు.

### తహసీల్దార్‌గా జోగారావు

హిరమండలం,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి) హిరమండలం తహసీల్దార్‌గా ఎన్ని జోగారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు శ్రీకాకుళం కలెక్టరు కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. ఇదివరకు హిరమండలం తహసీల్దార్‌గా పనిచేసిన హనుమంతురావు పదవీవిరమణ చేశారు.

### సందిగాంలో పశువైద్యశిబిరం

హరిపురం, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): పశువ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు దువ్వాడ శ్రీకాంత్ కోరారు. మంగళవారం మందస మండలంలోని కొంకడాపుట్టి పంచాయతీ పరిధిలోగల సందిగాంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో 258 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేయించారు కార్యక్రమంలో మంగళపాత్రో, మాలతి, సిబ్బంది ధర్మేంద్ర, రవి పురుషోత్తం పాల్గొన్నారు.

## సాఫ్ట్ టెన్నిస్ జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక

పాతపట్నం సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలో ఎస్‌జీఎఫ్ సాఫ్ట్ టెన్నిస్ జిల్లాస్థాయి అండర్-14, 17,19 విభాగాల్లో బాలబాలికల క్రీడాకారుల ఎంపిక పోటీలు మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని 270 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారని వ్యాయామసంఘ రాష్ట్ర అధ్యక్షుడు యెన్ని శేఖర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్జారిమాజ్‌బేగ్, సుజాత, రాజారావు, కృష్ణ, కృష్ణారావు, లోకేశ్వరరావు, లక్ష్మీనారాయణ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

**బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్ పోటీలకు..**

పలాస, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):పలాస ప్రభుత్వపాఠశాల మైదానంలో డివిజన్‌స్థాయి క్రీడలు సోమవారం నిర్వహించారు.ఈ మేరకు బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించి జిల్లా క్రీడల్లో పాల్గొనడానికి ఎంపికచేశారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, హెచ్‌ఎం ఆర్.రాజ్యలక్ష్మి, విద్యాకమిటీ చైర్మన్ తారక్, డివిజన్ క్రీడల కోఆర్డినేటర్ పి.తవిటయ్య, మల్లా సంతోష్, రాష్ట్ర అథ్లెటిక్స్ కమిటీ చైర్మన్ కె.హరిబాబు, ఎన్వీ జోగారావు, పద్మలోచనరావు, కేపీ రెడ్డి, గజేంద్ర, ఎస్.రామారావు పాల్గొన్నారు.

**ఈదులవలస మోడల్‌స్కూల్ బాలికలు..**

పోలాకి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈదులవలస మోడల్‌స్కూల్ బాలికలు శ్రీకాకుళంలోని కోడిరామూర్తి స్టేడియంలో జరిగిన డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలో సత్తాచాటి జిల్లాస్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పైడి.ప్రవీణ, పీడీ ఎం.నీలం తెలిపారు. ఈమేరకు ప్రతిభచూపిన పి.ఝాన్సీ, ఎం.తనూశ్రీలను అభినందించారు.

**సీది ఉన్నతపాఠశాల విద్యార్థులు..**

పాతపట్నం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సీది జడ్పీపాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ క్రీడల్లో సత్తాచాటారు.కొరసవాడ జడ్పీపాఠశాలలో జరిగిన పోటీల్లో 25 మంది విద్యార్థులు అండర్-14, 19విభాగాల్లో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బి.సింహాచలం తెలిపారు. పోటీలకు శిక్షణఇచ్చిన పీడీ మురళీమోహన్, మల్లేశ్వరరావు హేమలత, విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందించారు.

### విద్యార్థులు భాగస్వామ్యంకావాలి

పాతపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్లెల పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని యూబీఏ నోడల్‌అధికారి ప్రొఫెసర్ జర్రా అప్పారావు తెలిపారు. మంగళవారం పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నత్ అభియాన్ ఆధ్వర్యంలో ఓరియెంటేషన్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీరాములు, తొగరాం ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డి శివరామకృష్ణ పాల్గొన్నారు.

### అటవీ హక్కుల చట్టం తెలుసుకోవాలి

మెళియాపుట్టి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అటవీ హక్కు చట్టం కోసం గిరిజనులు తెలుసుకోవాలని కొత్తూరు వెలుగు అసోసియేషన్ రిసోర్స్‌పర్సన్ చిరంజీవిరావు తెలిపారు. మంగళవారం కేరాశింగి, పంచాయతీలో అటవీహక్కుల చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎ.నాగరాజు, రంగారావు పాల్గొన్నారు.

### గుర్తింపు కార్డుల పంపిణీ

నరసన్నపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సౌజన్యంతో సమకూర్చిన గుర్తింపు కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఉప్పాడ శాంతారావు, హెచ్‌ఎం పైడి వెంకటరావు, జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ పవన్, ఉపాధ్యాయులు శాంతారావు, రూపావతి, రాజేంద్రనాయుడు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కొత్తూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు క్లినిక్‌లు నిర్వహిస్తున్న వైద్యులపై శాఖాపరంగా చర్యలు చేపట్టడతామని కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ప్రసన్నకుమార్ తెలిపారు. మంగళవారం కొత్తూరులోని పలు ప్రైవేటు ఆస్పత్రులను పరిశీలించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఓ ప్రైవేట్‌క్లినిక్‌లో ఇంజక్షన్ వికటించి మహిళమృతి చెందడంతో జిల్లా వైద్యాధికారి ఆదేశాలమేరకు ప్రైవేట్‌ఆస్పత్రులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే క్లినిక్‌లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

### 29న జిల్లాస్థాయి మహిళా గ్రూప్ డ్యాన్స్‌పోటీలు

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):మండలంలోని అమలపాడు లో సరస్వతిదేవి పూజా 24వ వార్షికోత్సవాల్లో భాగంగా ఈనెల 29న జిల్లా స్థాయి మహిళా గ్రూప్‌డ్యాన్స్‌పోటీలు నిర్వహించనున్నట్లు పూజా కమిటీ తెలిపింది. వివరాలకు 9502069233, 9703927643, 9949321542 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరింది.

### గ్రేడ్-2 జేఎల్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

పాతపట్నం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రేడ్-2 జేఎల్‌ఎంలను రెగ్యులర్ చేయాలని, పెండింగ్‌డీఏలను విడు దలచేయాలని, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించా లని విద్యుత్‌సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. మంగళవారం పాతపట్నంలోని 11 కేవీవిద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగ ణంలో విద్యుత్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో 1104, 327, తెలుగునాడు తదితర సంఘాల నాయకుల ఉద్యోగులు పాల్గొన్నారు.

### నీట్ పీజీలో 296వ ర్యాంకు

నందిగాం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):జల్లపల్లికి చెందిన ఆరంగి విశాల్ నీట్ పీజీ రాష్ట్రస్థాయి ఫలితాల్లో సత్తాచాటాడు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 296వ ర్యాంకు సాధించాడు. ఇటీవల విడుదలైన ఆల్‌ఇండియా ఫలితాల్లో 5136వ ర్యాంకు లభించింది. ఎంబీబీఎస్‌ను శ్రీకాకుళం రిమ్స్‌లో పూర్తిచేశాడు. విశాల్ సత్తాచాటడంతో తండ్రి జానకిరామయ్య,తల్లి సరిత గ్రామస్థులు, బంధువులు అభినందించారు.

### అర్హులందరికీ పదోన్నతులు ఇవ్వాలి

పాతపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పదోన్నతులుకల్పించాలని వీఆర్‌ఏల సంఘం డిమాండ్‌చేసింది. పాతపట్నంలో తహసీల్దార్ నందిగామ ప్రసాదరావుకు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకుడు పణుకు వెంకట రమణ ఆధ్వర్యంలో జరిగినకార్యక్రమంలో వీఆర్‌ఏలు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు